భవన నిర్మాణాల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం

- రూ.50 లక్షల సీడీఎఫ్ పనులన్నీ పెండింగ్
- అన్ని చోట్లా అసంపూర్తిగానే..



మండల కేంద్రంలో రజక సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం వేసిన పిల్లర్లు

లింగాలఘణపురం: కమ్యూనిటీ భవన నిర్మాణాలకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. మండలంలో రూ.50 లక్షల సీడీఎఫ్ నిధులు కమ్యూనిటీ భవనాలకు కేటాయించగా ఎక్కడా పనులు పూర్తి కాలేదు. కొన్ని చోట్ల రెండుమూడేళ్లుగా నిరుపయోగంగా ఉండగా మరికొన్ని చోట్ల ఏడాదిగా మంజూరైన టెండర్లకు ఎవరు రావడంలేదు. పనులను మంజూరు చేయించుకునేందుకు చూపించే ఆత్రుత ఆపై పనులు పూర్తి చేయడంలో ఆయా నాయకులు ఆసక్తి చూపడంలేదు. ఎమ్మెల్యేల చుట్టూ తిరిగి పనులైతే మంజూరు చేయించాం అనే గొప్పలు చెప్పుకోవడం తప్ప నిర్మాణాలు పూర్తి చేయడంలో అంతా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పనులన్నీ పెండింగ్..

మండలంలోని కళ్లెం, చీటూరు గ్రామాల్లో మహిళా మండలి భవన నిర్మాణాలకు 2023–2024 ఏడాదికి సీడీఎఫ్ నిధులు ఒక్కొక్కదానికి రూ.10 లక్షల చొప్పున మంజూరు చేశారు. నేటికీ పనులకు టెండర్లు వేస్తే ఎవరూ ముందుకు రావడంలేదు. కొత్తపల్లిలో రూ.5 లక్షలు మంజూరు చేస్తే నిర్మాణానికి స్థలమే కరువైంది. మండల కేంద్రంలో రజక సంఘ భవనానికి రూ.5 లక్షలు కేటాయించగా పిల్లర్ల వరకు పూర్తి చేశారు. ఇటీవలే ఎమ్మెల్యే కడియం శ్రీహరి మరో రూ.10లక్షలు మంజూరు చేశారు. ఆ పనులకు టెండర్లు పూర్తయినట్లు తెలిసింది. కానీ పనులు మాత్రం మొదలు పెట్టలేదు. అదేవిధంగా కళ్లెం కురుమ సంఘం భవనానికి రూ.5 లక్షలు మంజూరు చేయగా పనులు చేపట్టి పూర్తి చేయగా, నిధులు సరిపోకపోవడంతో మరో రూ.5 లక్షలు ఎమ్మెల్యే కేటాయించారు. నాగారానికి రూ.5లక్షలు, మాణిక్యాపురానికి రూ.5లక్షలు సీడీఎఫ్ నిధులు కేటాయించగా ఏ నిధులు ఏం చేయాలో ఎవరికి అర్థం కావడంలేదు. ఇకపోతే ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో నేలపోగులకు రూ.5లక్షలు సీడీఎఫ్ నిధులు కేటాయించగా నేటికీ పనులు కావడంలేదు. మండల కేంద్రంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే రాజయ్య రూ.5 లక్షలు మంజూరు చేయగా స్థల వివాదంతో నేటికీ ఆ పనులు మొదలుకాలేదు.

ఎమ్మెల్యే కడియం అసంతృప్తి

కమ్యూనిటీ భవనాలు కావాలంటూ ఆయా సామాజిక వర్గాలతో పాటు మహిళా సంఘాలు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరడంతో ఎంతో ప్రాధాన్యంతో సీడీఎఫ్ నిధులు కేటాయిస్తే పనులు పూర్తి చేయడంలో నాయకత్వం ఆసక్తి చూపడంలేదు. ఇటీవల మండల కేంద్రంలో కురుమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణలో నాయకులు తమ గ్రామాలకు భవన నిర్మాణాలు కావాలంటే ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు కావాలంటున్నారే తప్ప ఎక్కడా పూర్తి చేయడంలేదని, పూర్తి చేసిన తర్వాత పనుల కోసం రావాలని వార్నింగ్ ఇచ్చారు.

టెండర్లకు ముందుకు రావడంలేదు..

సీడీఎఫ్ నిధులతో కమ్యూనిటీ భవన నిర్మాణాలకు టెండర్లు వేస్తే ఎవరూ ముందుకు రావడంలేదు. రూ.5 లక్షల లోపు పనులకు నామినేటెడ్ ఇస్తే ఆ పనులు కూడా చేయడంలో ఆసక్తి చూపడంలేదు. కొన్ని చోట్ల స్థలాల గొడవలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల నిధుల మంజూరు ప్రొసీడింగ్స్‌లో గందరగోళం ఉంది. మండల కేంద్రం స్థల వివాదంలో నాపై కేసు నమోదైంది.

– శ్రీనివాస్, ఏఈ, పంచాయతీ రాజ్, లింగాలఘణపురం

క్లుప్తంగా

ఛత్రపతి శివాజీ పోరాటం స్ఫూర్తిదాయకం

- వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తక్కెళ్లపల్లి రవీంద్ర



పాలకుర్తి టౌన్: ఛత్రపతి శివాజీ పోరాటం స్ఫూర్తిదాయకమని, నేటి యువత శివాజీ మార్గంలో నడవాలని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తక్కెళ్లపల్లి రవీంద్ర అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని దర్దేపల్లిలో శివాజీ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొఘల్ చక్రవర్తి ఔరంగజేబును ఓడించిన గొప్ప వీరుడు ఛత్రపతి అని అన్నారు. శివాజీని స్ఫూర్తిగా తీసుకుని హిందూ మతం అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. ప్రతీఒక్కరు సనాతన ధర్మం కోసం పనిచేయాలన్నారు. దర్దేపలి గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో శివాజీ యువసేన అధ్యక్షుడు రేగుల నరేష్, కార్యదర్శి రాసాల మహేశ్, సిద్ధం వాసు దేవరావు, సమ్మయ్య, వేల్పుల వేణు, కోడెం సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత

బచ్చన్నపేట: మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో నిర్వహించనున్న బీరప్ప పండుగ ఆహ్వాన పత్రికను పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వేముల బాల్‌రాజుకు నాయకులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 7 నుంచి 10వ తేదీ వరకు బీరప్ప పండుగను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేస్తున్నట్లు చెప్పారు. పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ బేజాడి సిద్దులు, మేకల రాజు, మేకల మల్లేశం, మహేష్, సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జాతర బందోబస్తు



పాలకుర్తి టౌన్: ఈనెల 25 నుంచి మార్చి 01వ తేదీ వరకు పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో నిర్వహించే మహాశివ రాత్రి జాతర బ్రహ్మోత్సవాలకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆలయంలో పార్కింగ్ స్థలం, క్యూలైన్ల ఏర్పాటును ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబుతో కలిసి ఆయన పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు నాలుగు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎస్సై దూలం పవన్‌కుమార్, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట


చిల్పూరు: వాగుల్లోంచి ఇసుకను అక్రమంగా రవాణా చేయకుండా చర్యలు తీసుకోవాలంటూ జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు గురువారం ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ ప్రొక్లెయినర్‌తో చిన్న పెండ్యాల వాగు సమీపంలోని దారిలో కందకాలు తీయించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాగుల్లోంచి రాత్రి సమయాల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తుండడంతో అడ్డుకట్టు వేసేందుకు కందకాలు తీయిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'సరోత్తంరెడ్డిని గెలిపించాలి'



చిల్పూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు, మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు కోరారు. పల్లగుట్ట, మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పార్టీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరోత్తంరెడ్డిని గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. కౌన్సిల్ మెంబర్ వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్, తోకల సంపత్‌రెడ్డి, వెలిశాల శ్రీనివాస్, నామాల రాహుల్ పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

రఘునాథపల్లి: మండలంలోని కోమల్ల రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల మండలి, కార్యనిర్వాహక సమితి ఆధ్వర్యంలో గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం, వైనతేయ ప్రతిష్ఠ, హోమం, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ వరకు అధ్యయన, బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయన్నారు. 21వ తేదీ మధ్యాహ్నం తిరుకల్యాణోత్సవం, సాయంత్రం గరుడ వాహన కల్యాణం, 22వ తేదీన మహాపూర్ణాహుతి, సాయంత్రం అవబృధ స్నానం, రాత్రి పుష్పయాగం, ధ్వజావరోహణం వంటి పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సమాజ మార్గదర్శకులుగా నిలవాలి



పరీక్ష మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో రాజేష్‌నాయక్

కొడకండ్ల: విద్యార్థులు విద్యలో రాణించి మంచి ఫలితాలు సాధించి సమాజ మార్గదర్శకులుగా నిలవాలని స్వరాజ్ ఫౌండేషన్ చైర్మన్ గుగులోత్ రాజేష్‌నాయక్ కోరారు. గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, ఇంగ్లిష్ డిక్షనరీలు ఆయన పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సతీష్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ జాంబనాయక్, వీరేష్‌నాయక్, వీరన్న, బాలాజీ, రోహిత్ పాల్గొన్నారు.

స్వయంపరిపాలన దినోత్సవం



స్వయంపరిపాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

దేవరుప్పుల: మండలంలోని పెద్దమదూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు గురువారం ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌గా సీహెచ్ కిరణ్‌కుమార్, డీఈఓగా సీహెచ్ చరణ్‌పాల్, ఎంఈఓగా బి.జెస్సికా, హెచ్‌ఎంగా బి.సహస్ర, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులు పాత్ర పోషించి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పద్మారాణి మాట్లాడుతూ స్వయంపరిపాలనతో తరగతి నిర్వహణ, విద్యాభ్యున్నతి వినియోగం, నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటారన్నారు. ఉపాధ్యాయులు వెంకన్న, ప్రతాప్, సత్యనారాయణ, రోజా పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ప్రమాద బీమా ఉపయోగం



బీమా పత్రాలను జర్నలిస్టులకు అందజేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: జర్నలిస్టులకు వ్యక్తిగత ప్రమాద బీమా ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. టీఎస్‌జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్‌కుమార్, జాయింట్ సెక్రటరీ రావుల నరేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు ఆధ్వర్యంలో యూనియన్ జిల్లా సభ్యులకు రూ.5లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యానికి సంబంధించిన పత్రాలను గురువారం కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా బాధ్యులు ఉప్పలంచి నరేందర్, బొమ్మగాని శ్రీకాంత్, ఉపేందర్, చిల కిరణ్‌కుమార్, ఎం.శివకుమార్, పి.రాజు, చెల్లోజు నవీన్ చారి, ఓంకార్, అఫ్రోజ్, గన్ను కార్తీక్, వినోద్, లక్ష్మయ్య, పాండు, దేశాయ్ రెడ్డి, చిటుకుల అంజయ్య, గండి ప్రవీణ్ పాల్గొన్నారు.

25 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్



సీఐని ఆహ్వానిస్తున్న యూత్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు బొంకూరి మహేశ్, మంద మహేందర్, బొంకూరి దయాకర్ తెలిపారు. ఈమేరకు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభానికి రావాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ జి.వేణుకు యూత్ ఆధ్వర్యంలో గురువారం కరపత్రాలు అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఎంట్రీ ఫీజు రూ.1,000 చెల్లించాలని, విజేత జట్టుకు రూ.30వేలు నగదు బహుమతి, ద్వితీయ జట్టుకు రూ.20వేలు, తృతీయ జట్టుకు రూ.10వేలు నగదుతో పాటు షీల్డులు అందించనున్నట్లు చెప్పారు. ప్రతీ మ్యాచ్ పది ఓవర్లు ఆడించబడుతుందని, మూడు ఓవర్లు పవర్ ప్లే ఉంటుందని, ప్రతీ జట్టు కమిటీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని, ఎవరి కిట్టు వారే తెచ్చుకోవాలని, అంపైర్‌దే తుదినిర్ణయంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు మందపురం ఎల్లగౌడ్, యూత్ బాధ్యులు ఐత అజయ్, జీడి మోషతోపాటు తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ మార్టులో చోరీ

- రూ.43వేల నగదు అపహరణ
- జనగామలో ఘటన



లిక్కర్ మార్టులో మద్యం బాటిల్ తీసుకుంటున్న దొంగ

జనగామ: పట్టణంలోని జనగామ లిక్కర్ మార్టులో చోరీ జరిగింది. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. ఇద్దరు దుండగులు లిక్కర్ మార్టు పైకప్పు రేకులు పగుల గొట్టారు. అనంతరం లోపలికి దిగి రూ.43వేల నగదుతోపాటు రెండు ఫుల్ బాటిళ్లు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం మార్టుకు వచ్చిన యజమాని పైన రేకుల కప్పు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు దుండగులు మార్టులో చోరీ చేసిన ఘటన సీసీ కెమెరాలో నిక్షిప్తమవగా దాని ఆధారంగా పోలీసులు విచారణ చేస్తున్నారు.

దొంగతనం కేసులో అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ దామోదర్‌రెడ్డి

జనగామ రూరల్: రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ దామోదర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మరిగడి పరిధిలోని కోటగుట్టకు చెందిన బానోత్ కిరణ్ జనగామలోని గ్రెయిన్ మార్కెట్ యార్డ్‌లో హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. హమాలీ పని ద్వారా వచ్చే డబ్బులు కుటుంబ పోషణకు సరిపోక మద్యానికి బానిసయ్యాడు. ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈ క్రమంలో ఈనెల 18 తేదీన ఓల్డ్ బీట్ బజార్ ఏరియాలో ఒక రేకుల ఇంటికి తాళం వేసి ఉండటాన్ని చూసి వెంటిలేటర్ పగులగొట్టి ఇంట్లోకి దూరి దొంగతనానికి పాల్పడ్డాడు. కాగా, గురువారం జనగామ నెహ్రూ పార్క్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వారిని చూసి పారిపోతుండటంతో పట్టుకుని విచారించగా దొంగతనాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. గతంలో జనగామ పోలీసు స్టేషన్‌లో కిరణ్‌పై దొంగతనం కేసు ఉందన్నారు. దొంగను పట్టుకున్న ఎస్సై భరత్, కానిస్టేబుళ్లు జి.రమేశ్, పులి అరవింద్, సురేశ్‌లను సీఐ అభినందించారు.

తెరుచుకున్న వాటర్ ప్లాంట్

సాక్షి ఎఫెక్ట్..



మినరల్ వాటర్ పోస్తున్న సిబ్బంది

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్ గురువారం తెరుచుకుంది. 'మూత పడిన వాటర్ ప్లాంట్' శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి తండ రాంబాబు స్పందించి తెరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌లో పనిచేసే సిబ్బందిని వేరే పనులకు కేటాయించడం జరిగిందని, ఇక నుంచి వారు ప్రజలకు అందుబాటులో ఉంటూ మినరల్ వాటర్‌ను అందిస్తారన్నారు. ప్రజలు జీపీ మినరల్ వాటర్ ప్లాంట్‌ను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

'కుంటకు గండి కొట్టిన వారిపై చర్య తీసుకోవాలి'



మాట్లాడుతున్న కనకరాజు

చిల్పూరు: కర్జాలకుంటకు గండి కొట్టడమే కాకుండా అందులోని నాలుగు ఎకరాల భూమిని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం నాయకుడు నారబోయిన కనకరాజు అధికారులను కోరారు. రాజవరం గ్రామంలో గురువారం సంఘం బాధ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామ సమీపంలోని కర్జాలకుంటలో ప్రతీ వేసవిలో నీరు నిండుగా ఉండడంతో బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటకుండా ఉండేవన్నారు. ఇటీవల తీగలతండాకు చెందిన ఓ నాయకుడు కుంటకట్టకు గండి కొట్టడంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కబ్జా చేశాడని ఆరోపించారు. కాగా, నీరంతా వాగునుంచి రిజర్వాయర్‌లోకి వెళ్లిందని, దీంతో వేసవి ఆరంభం కాకముందే భూగర్భ జలాలు అడుగంటాయని అన్నారు. ఈ విషయంలో అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈర్ల కనుకరాజు, సారయ్య, రవి, సదానందం, రాజు, రాజేందర్, రాజ్‌కుమార్, శంకర్, గణేష్,. కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన పసుల బాలమణి–భాస్కర్ దంపతుల కూతురు శృతి వివాహానికి సామాజిక సేవాకర్త కొడూరి శివకుమార్‌గౌడ్ గురువారం రూ.5వేల సాయం అందజేశారు. శ్రీనివాస్, రాములు, భిక్షపతి, రాజేందర్, రవి, సాయి, కిష్టయ్య ఉన్నారు.

స్నేహితుల చేయూత

బచ్చన్నపేట: మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన మానెపల్లి సత్తయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా, కట్కూర్ ప్రభుత్వ పాఠశాలలో సత్తయ్యతో కలిసి చదుకున్న స్నేహితులు బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించి రూ.15,500 సాయం అందజేశారు. పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణపురంలో..



పాలకుర్తి: లక్ష్మీనారాయణపురం గ్రామంలో తూటి నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, గురువారం జెడ్పీ పాఠశాలలో 2005–06 టెన్త్ బ్యాచ్ నాగరాజుతో కలిసి చదువుకున్న బాల్య స్నేహితులు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.14వేల సాయం అందజేశారు. నవీన్ కుమార్, తూటి పర్శరాములు, ప్రకాశ్, సోమయ్య, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

మంచు తెరల మాటున..

వేసవి సమీపించి మధ్యాహ్న సమయంలో దంచి కొడుతున్న ఎండలకు తోడు.. తెల్లవారు జాము కురుస్తున్న పొగ మంచు ప్రజలను ఆహ్లాదభరితం చేస్తోంది. గురువారం తెల్లవారు జాము 3 గంటల నుంచి ఉదయం 8.30 వరకు మంచు తెరల మాటున రహదారులన్నీ కప్పుకు పోయాయి. దీంతో వాహనాల హెడ్‌లైట్లు ఉన్నా ముందుకు సాగలేని పరిస్థితి. రెండు రోజులుగా జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో సిద్దిపేట, హైదరాబాద్, వరంగల్, సూర్యాపేట రహదారులపై చాలాచోట్ల భారీ వాహనాలు రోడ్డు పక్కనే ఆపేశారు.

–జనగామ



జనగామ ఫ్లై ఓవర్‌పై కమ్ముకున్న పొగమంచు



శామీర్‌పేట, వడ్లకొండ జంక్షన్‌లో..



చంపక్‌హిల్స్ కొండల నడుమ సిద్దిపేట రోడ్డుపై..

పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలి



దాత అందజేసిన ఆల్‌ఇన్ గైడ్‌లతో విద్యార్థులు

జఫర్‌గఢ్: పాఠశాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఉప్పుగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పరహత్ కౌసర్ కోరారు. చైత్ర చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు రూ.10 వేల విలువైన ఆల్‌ఇన్ వన్ గైడ్‌లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లకొండ సునీత కృష్ణారెడ్డి కుమారుడు శశిధర్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. గాదెపాక భాస్కర్, ఉపాధ్యాయులు వెంకటపతి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్, కిరణ్‌కుమార్, దిలీప్‌కుమార్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



అంత్యక్రియల్లో పాల్గొన్న రాజయ్య

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మారపల్లి సౌజన్య భర్త మధుకర్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పార్టీ బృందంతో కలిసి బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. అనంతరం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు మారపల్లి కరుణాకర్, ఎండీ ఖాసీం, యాదగిరి, ఇల్లందుల రాజు తదితరులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జనగామ : 9951602871
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేశ్ (S.R) : 9849921793 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)